సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 30 । మార్చి । 2024



'ట్రాక్' తప్పిన పనులు

మణుగూరులోని బీటీపీఎస్‌కు బొగ్గు తరలింపు కోసం నిర్మిస్తున్న రైల్వే మార్గం పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. 8లో




కాంగ్రెస్ హయాంలో..

కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
40° / 24°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరిగి, మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వడగాలులు వీస్తాయి.



వట్టిపోతున్న గోదావరి


భద్రాచలం వద్ద గోదావరి నదిలో తగ్గిన నీటి ప్రవాహం

జిల్లా ప్రజలకు తాగునీరందించే గోదావరి వట్టిపోతోంది. నీటి ప్రవాహం తగ్గి నది పిల్లకాలువలా ప్రవహిస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే మందు వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తప్పవు. ఎగువన మేడిగడ్డ బ్యారేజీలోనూ నీళ్లు లేవు. ఐదారేళ్ల క్రితం గోదావరి అడుగంటి నీటి సరఫరా లేక అశ్వాపురం హెవీవాటర్ ప్లాంట్‌లో ఉత్పత్తి సైతం నిలిచిపోయింది. కొద్ది రోజులు తాగునీటికీ ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో నీటి పారుదల, మిషన్ భగీరథ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే మే, జూన్ నెలల్లో ప్రజల దాహార్తి తీరదు. –బూర్గంపాడు

పిల్ల కాలువలా మారిన నదీ ప్రవాహం

- ఇదే పరిస్థితి కొనసాగితే తాగునీటికి కటకట..
- మందువేసవిలో మిషన్ భగీరథకు నీటి లభ్యత కష్టమే
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుంటే తప్పని ముప్పు

జిల్లాలోని పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాలతోపాటు ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మున్సిపాలిటీకి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరాఫరా చేస్తున్నారు. ఇందుకోసం అశ్వాపురం మండలంలోని కుమ్మరిగూడెం సమీపంలో ఏర్పాటు చేసిన ఇన్‌టేక్‌వెల్ ద్వారా గోదావరి జలాలు సేకరిస్తున్నారు. అక్కడి నుంచి మోటార్లతో అశ్వాపురం మండలంలోని మిట్టగూడెం వద్ద రథం గుట్టపై ఉన్న వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు నీటిని పంపింగ్ చేస్తున్నారు. పాల్వంచ మండలంలోని తోగ్గూడెం వద్ద ఏర్పాటు చేసిన మరో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు పైప్‌లైన్‌లతో నీటిని తరలిస్తున్నారు. ఈ రెండు ప్లాంట్ల నుంచి శుద్ధి చేసిన గోదావరి జలాలను జిల్లాలోని భద్రాచలం నియోజకవర్గం మినహా మిగతా అన్ని నియోజకవర్గాలకు, సత్తుపల్లి మున్సిపాలిటీకి, జూలురుపాడు మండలానికి తాగునీరుగా సరఫరా చేస్తున్నారు. ఇందుకోసం గత ప్రభుత్వం ఇంటింటా మిషన్ భగీరథ నల్లాలు ఏర్పాటు చేసింది.

మేడిగడ్డలో నీళ్లులేవు..

ఎండల తీవ్రత పెరిగి గోదావరి ప్రవాహం కనిష్టస్థాయికి పడిపోతే తాగునీటి అవస్థలు తప్పవు. గతంలో ఇలాంటి పరిస్థితులు ఎదురైతే ఎగువన మేడిగడ్డ బ్యారేజీలో నీటి నిల్వ ఉండటంతో దిగువకు విడుదల చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగటంతో నవంబర్ నెలలోనే గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. మేడిగడ్డకు ఎగువన ఉన్న



కుమ్మరిగూడెం వద్ద ఉన్న మిషన్ భగీరథ ఇన్‌టేక్‌వెల్

ప్రాజెక్టులలో నీటి నిల్వలుంటేనే ఈ ఏడాది మే, జూన్ నెలల్లో తాగునీటి అవసరాలకు వినియోగించుకునే అవకాశముంది.

అధికారులు మేల్కొంటేనే..

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. గోదావరిలో నీటి లభ్యత, ఎగువన ఉన్న ప్రాజెక్ట్‌ల్లో నీటి నిల్వలపై ముందస్తు సమీక్షలు జరిపి తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలి. ఇప్పటికే గోదావరి పరీవాహక జిల్లాల్లో రైతులు సాగు చేసిన యాసంగి పంటలు సాగునీరు అందక ఎండిపోతున్నాయి. నదీ పరీవాహక ప్రాంతాల్లో గత పదేళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయికి భూగర్భ జలాలు అడుగంటినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఇప్పుడే మేల్కొనాలి.

దుమ్ముగూడెం వద్ద 47.5 మీటర్లకు పడిపోతే..

కుమ్మరిగూడెం ఇన్‌టేక్‌వెల్ నుంచి రోజూ 150 మిలియన్ లీటర్ల గోదావరి జలాలను మిషన్ భగీరథ పథకం కోసం తీసుకుంటున్నారు. 2018 నుంచి ఈ పథకం నడుస్తుండగా, వేసవిలో ఒకట్రెండు సార్లు నీటిలభ్యత ఇబ్బందికరంగా మారింది. ఆ సమయంలో గోదావరి ఎగువన ఉన్న మేడిగడ్డ నుంచి నీటిని విడుదల చేసి ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. కుమ్మరిగూడెం–దుమ్ముగూడెం మధ్య గోదావరిపై నిర్మించిన ఆనకట్ట వల్ల కొంతమేర నీరు నిల్వ ఉంటుంది. ఆనకట్ట ఆధారంగానే కుమ్మరిగూడెం వద్ద ఇన్‌టేక్ వెల్ నిర్మించారు. ప్రస్తుతం దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద 49 మీటర్ల ఎలివేషన్ లెవల్‌లో నీటి నిల్వ ఉంది. మరోవైపు ఎగువ నుంచి గోదావరిలో నీటి ప్రవాహం తగ్గిపోతోంది. దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ సామర్థ్యం 47.5 మీటర్లకు తగ్గితే ఇన్‌టేక్‌వెల్‌లోకి నీటి ప్రవాహం తగ్గుతోంది. అయితే ఏప్రిల్ నెలాఖరు వరకు మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఇబ్బందులుండవు.

ప్రస్తుతానికి ఇబ్బందులు లేవు

ప్రస్తుతం గోదావరిలో ఉన్న నీటి ప్రవాహంతో మిషన్ భగీరథ పథకానికి ఇబ్బందులు లేవు. ఏప్రిల్ నెలాఖరు వరకు ఇన్‌టేక్‌వెల్‌లోకి నీరు సరఫరా అవుతుంది. దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద 47.5 మీటర్ల ఎలివేషన్ లెవల్ కంటే నీటి నిల్వ తగ్గితే ఇబ్బందులు వచ్చే అవకాశముంది. గోదావరిలో నీటి ప్రవాహం తగ్గుతున్న నేపథ్యంలో ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి నీటిని తీసుకునేందుకు ఇరిగేషన్‌శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటాం. –ప్రశాంత్, మిషన్ భగీరథ ఏఈ

విస్తరణకు చిక్కులు


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

- వైద్య కళాశాల ఆరంభంలోనే ఇబ్బందులు
- 220 పడకలతో ఇరుకుగా మారిన సర్వజన ఆస్పత్రి
- పూర్తిస్థాయి సామర్థ్యం 600 పడకలకు విస్తరించేదెలా..?
- ఇప్పటికే రామవరంలో 100 పడకలతో మాతాశిశు కేంద్రం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మెడికల్ కళాశాల నిర్మాణం, విస్తరణ విషయంలో ప్రణాళిక కొరవడింది. దీంతో ఆరంభంలోనే చిక్కులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా సరైన వ్యూహం అమలు చేయకపోతే భవిష్యత్‌లో ఆస్పత్రి విస్తరణ కష్టంగా మారేఅవకాశం ఉంది.

హడావిడిగా పడకల పెంపు

కొత్త జిల్లా ఏర్పాటైన తర్వాత 2022–23 విద్యా సంవత్సరానికి జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరైంది. కాలేజీ అనుమతులకు జిల్లాలోని వైద్యశాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సంయుక్తంగా కృషి జరిగింది. ఇరుకైన స్థలంలో ఉన్న కొత్తగూడెం ఏరియా ఆస్పత్రిలో పడకల సామర్థ్యాన్ని వంద నుంచి 220 పడకలకు పెంచారు. ఇందుకోసం హడావిడిగా పాత భవనంపై కొత్తగా ఫ్లోర్ నిర్మించారు. ఏరియా ఆస్పత్రి నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న రామవరం ఏరియా ఆస్పత్రిని సైతం కలుపుకుని పడకల సామర్థ్యాన్ని 320 వరకు పెంచారు. టీ హబ్, సీటీ స్కాన్ తదితర సౌకర్యాలు ఉన్నాయని పేర్కొంటూ ఎట్టకేలకు 2022–23 ఏడాది అడ్మిషన్లకు లెటర్ ఆఫ్ పర్మిషన్ (ఎల్‌ఓపీ) సాధించారు.

మెడికల్ లెక్కలు ఇలా

మెడికల్ కళాశాలకు సంబంధించి ప్రారంభ అనుమతులు సాధించేందుకు 320 పడకల సామర్థ్యం ఉండాలి. కానీ ఆ తర్వాత దశల వారీగా ఆస్పత్రిలో పడకల సామర్థ్యాన్ని 600 వరకు పెంచాల్సి ఉంటుంది. ఆరు వందల పడకల సామర్థ్యం కలిగిన ఆస్పత్రిలో కనీసం 80 శాతం ఇన్‌పేషెంట్లు అంటే కనీసం 420 మంది రోగులు ఎప్పుడూ వైద్య సేవలు పొందుతూ ఉండాలి. ఇన్‌పేషెంట్ల సంఖ్య పెరగాలంటే కచ్చితంగా సాధారణ వైద్య సేవలతోపాటు సూపర్ స్పెషాలిటీ సేవలు కూడా అందుబాటులోకి రావాలి. ఇవన్నీ అందుబాటులో ఉన్నప్పుడే సెకండియర్ నుంచి హౌస్ సర్జన్ వరకు ఒక్కో బ్యాచ్‌లో 150 వంతున 450 మంది విద్యార్థులు వైద్య విద్య అభ్యసించేందుకు అనువుగా ఉంటుంది.

స్థలం లేక ట్రామాకేర్ సెంటర్ రామవరంలో నిర్మాణం..

మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న కొత్తగూడెంలోని సర్వజన ఆస్పత్రి నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఉంది. వంద పడకలుగా ఉన్న ఈ ఆస్పత్రిని 220 పడకలకు విస్తరించడంతో ఆస్పత్రి ప్రాంగణం అంతా ఇరుకుగా మారింది. దీంతో ఈ ఆస్పత్రికి పీక్ అవర్స్‌లో అంబులెన్సు వెళ్లి రావడమే కష్టంగా ఉంది. యాభై పడకలతో ట్రామా కేర్ సెంటర్ గతేడాదే మంజూరైనా ఇక్కడ నిర్మించేందుకు స్థలం లేక జిల్లా అధికారులు తర్జనభర్జన పడ్డారు. చివరకు ట్రామా కేర్ సెంటర్‌ను కొత్తగూడెం ఆస్పత్రిలో కాకుండా రామవరంలో ఉన్న మాతాశిశు ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు పనులు సైతం ప్రారంభమయ్యాయి.

ఆస్పత్రి అక్కడ.. వైద్యులు ఇక్కడ

ట్రామా కేర్ సెంటర్ అంటేనే అత్యవసర వైద్య విభాగం. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు రోగులను మొదటి గంట (గోల్డెన్ అవర్)లో ఆస్పత్రికి తరలించి అత్యవసర వైద్య చికిత్స అందివ్వాల్సి ఉంటుంది. కొత్తగూడెం విషయానికి వస్తే ప్రధాన ఆస్పత్రి కొత్తగూడెంలోని భజన మందిర్ రోడ్డులో ఉండగా ట్రామా కేర్ సెంటర్ రామవరంలో ఉంది. ఇప్పటికే మాతశిశు కేంద్రం(రామవరం)లో ప్రసవం కోసం వచ్చిన గర్భిణులకు రకరకాల టెస్టుల విషయంలో శాంపిల్స్ తీసుకుని కొత్తగూడెంలో ఉన్న ల్యాబ్‌కు పంపిస్తున్నారు. ఫలితంగా విలువైన సమయం వృథా అవుతోంది.

మళ్లీ కేంద్రంలో అధికారం మాదే..

- ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధమయ్యారు
- బీజేపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి, అభ్యర్థి వినోద్‌రావు

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్రంలో మళ్లీ ప్రధాని మోదీ నేతృత్వాన బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ తమిళనాడు, కర్నాటక సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తెలిపారు. ఖమ్మంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎలాంటి స్కాంలకు తావులేకుండా సుపరిపాలన అందిస్తున్న మోదీ నాయకత్వాన్ని బలపర్చడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీ 420 సీట్లు గెలవనుండగా, అందులో ఖమ్మం కూడా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు ఓటు వేసినా వృథాయేనని, ఈ విషయాన్ని గుర్తించి ప్రజలు బీజేపీకి ఓటు వేసి ధర్మాన్ని గెలిపించాలని కోరారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలుకాలేదని.. అదే మోదీ హామీ ఇస్తే నెరవేర్చడం ఖాయమని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు నున్నా రవి, శ్యాంరాథోడ్‌తో పాటుదొంగల సత్యనారాయణ, దిద్దుకూరి వెంకటేశ్వర్లు, చావా కిరణ్, రంగా కిరణ్, రీగన్, ఏలూరు నాగేశ్వరరావు, విజయరాజు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని అంతరాలయంలో శుక్రవారం స్వామివారి మూలమూర్తులు స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీలక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం


అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి)ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


సుమాంజలి

గుండాల/ములకలపల్లి: జాతీయస్థాయి 33వ సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు మండలంలోని కాచనపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని యనగంటి సుమాంజలి ఎంపికైంది. విద్యార్థిని ములకలపల్లి టీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. ఈ నెల 31 నుంచి బిహార్ రాష్ట్రం పట్నాలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా విద్యార్థినిని పలువురు అభినందించారు.

సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్?

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలోని పాఠశాలల్లో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) సిలబస్ అమలుకు ఎడ్యుకేషన్ సొసైటీ సన్నాహాలు చేపట్టింది. ఈ మేరకు సింగరేణి వ్యాప్తంగా ఉన్న తొమ్మిది పాఠశాలల్లో కార్మికుల పిల్లలు ఎందరు చదువుతున్నారు? వారిలో స్టేట్ సిలబస్‌పై ఎందరికి ఆసక్తి ఉంది..? సీబీఎస్‌ఈ సిలబస్‌లో ఎంత మంది చదివించాలనుకుంటున్నారనే వివరాలు ఆరా తీస్తున్నారు. ఈ విషయమై ఈ నెల 26వ తేదీన జారీ చేసిన ఉత్తర్వుల ఆధారంగా అధికారులు వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఏప్రిల్ 1వ తేదీ నాటికి కార్పొరేట్ కార్యాలయానికి అందే నివేదిక ఆధారంగా అధికారులు సీబీఎస్‌ఈ సిలబస్ అమలుపై నిర్ణయం తీసుకునే అవకాశముందని సమాచారం.

అత్యవసర వైద్యంపై అవగాహన తప్పనిసరి


వైద్యులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): సీపీఆర్ (అత్యవసర వైద్యం)పై అందరూ అవగాహన కలిగి ఉండాలని సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్ అండ్ పా) ఎన్వీకే శ్రీనివాస్ తెలిపారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో రెండు రోజులుగా వైద్యులు, సిబ్బందికి ఈఎంఆర్ఐ వైద్యుల ఆధ్వర్యాన అత్యవసర వైద్యంపై ఇస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డైరెక్టర్ మాట్లాడారు. సింగరేణి ఉద్యోగులు, కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఇప్పటికే ఆస్పత్రులను ఆధునికీకరించి, నిపుణులైన వైద్యులను నియమించామని తెలిపారు. సింగరేణియులకే కాకుండా ప్రభావిత గ్రామాల్లో ప్రజలకు వైద్యం అందించటానికి క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ మేరకు వైద్యులు, సిబ్బందికి శిక్షణ ఇస్తుండగా, అత్యవసర సమయాల్లో మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న వైద్యులు, సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీఎంఓ సుజాత, ఏసీఎంఓ విక్టర్ వందనం, డీవైసీఎంఓ సునీల, మట్రోన్ మిస్, డాక్టర్లు కృష్ణమూర్తి, వి.శ్రీనివాసరావు, మాలతి, ఈఎంఆర్ఐ డాక్టర్లు నవీన్, జావిద్, సతీశ్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'వైద్య వృత్తికే మచ్చ'

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలో ఇటీవల వెలుగు చూసిన అక్రమ అబార్షన్ల వ్యవహారం వైద్య వృత్తికి మచ్చ తెచ్చేలా ఉందని ఐఎంఏ, ప్రసూతి వైద్యుల సంఘం బాధ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు కంభంపాటి నారాయణరావు, జగదీష్, ప్రసూతి వైద్యుల సంఘం ప్రతినిధులు మువ్వా లక్ష్మీరాజేశ్వరి, రెహనా బేగం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కొత్తగూడెంటౌన్: రుద్రంపూర్ సీఎస్ఐ చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



పాల్వంచ : క్రీస్తు సిలువ ప్రదర్శన..

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

జిల్లావ్యాప్తంగా శుక్రవారం క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అన్ని చర్చిలు, మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రదర్శనలతో జీసస్ మరణ ఘట్టాలను కళ్లకు కట్టినట్లు చూపారు. ప్రభువు సిలువ మోసే సన్నివేశాలను ప్రదర్శించారు. మత పెద్దలు క్రీస్తు త్యాగాన్ని వివరించారు. పలువురు ఉపవాస దీక్షలు విరమించారు. 9లో

దర్శనం ప్రశాంతంగా ఉండాలి

- అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- శ్రీరామనవమి ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలి
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్



రామాలయ, పర్ణశాలలో పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కలెక్టర్ ప్రియాంక, పీఓ ప్రతీక్ జైన్ తదితరులు

భద్రాచలం/దుమ్ముగూడెం: రామయ్య దర్శనానికి వచ్చే భక్తులకు వసతులు, ప్రశాంత దర్శనం కల్పించేలా అభివృద్ధి పనులు ఉండాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ పేర్కొన్నారు. శుక్రవారం దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి భద్రాచలం, పర్ణశాల పర్యటనకు వచ్చారు. వీరికి కలెక్టర్ ప్రియాంక ఆల, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ప్రతీక్ జైన్, దేవస్థానం ఈఓ రమాదేవి భద్రాచలంలోని బ్రిడ్జి పాయింట్ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈఓ రమాదేవి, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం ఆలయ విశిష్టతను అర్చకులు వివరించారు. అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారు, అభయాంజనేయస్వామి ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పండితులు వేదాశీర్వచనం చేసి పట్టువస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. కాగా తొలుత కేంద్ర ప్రభుత్వ పథకం ప్రసాద్‌లో భాగంగా బ్రిడ్జి పాయింట్ పక్కన నిర్మాణం చేపట్టే టూరిజం స్థలాన్ని పరిశీలించారు. భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించేలా నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం శ్రీ సీతారామచంద్ర స్వామివారి కల్యాణం జరిగే మిథిలా స్టేడియాన్ని సందర్శించారు. వీఐపీలు, భక్తులు స్వామివారి కల్యాణం తిలకించేలా చేస్తున్న ఏర్పాట్లపై దేవస్థానం ఈఓ రమాదేవిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. దేవస్థానంలోని లడ్డూల తయారీ కేంద్రం, దేవస్థానం ప్రాంగణంలోని పరిసరాలను పరిశీలించారు. భక్తులు ఇబ్బంది లేకుండా స్వామివారిని దర్శించుకునేలా రోప్, మ్యాటును ఏర్పాటు చేయాలన్నారు.

పర్ణశాలలో..

భద్రాచలం పర్యటనకు వచ్చిన వీరు తొలుత దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాలను సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ సీతారామచంద్ర స్వామి నడయాడిన ప్రదేశాలను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ భక్తులు ఇబ్బందులు పడకుండా శ్రీ సీతారామచంద్ర స్వామి చరిత్రను తెలిసే విధంగా తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవి నేపథ్యంలో భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయం చుట్టూ మ్యాట్ వేయించాలన్నారు. టాయిలెట్లు, ఇతర వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసే ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. శ్రీరామనవమి స్పెషల్ ఆఫీసర్ అనిల్ కుమార్, దుమ్ముగూడెం తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ ముత్యాలరావు పాల్గొన్నారు.

అయోధ్యను మించి భద్రాచలం అభివృద్ధి..

అనంతరం అంతర్గతంగా దేవస్థాన అధికారులతో సమావేశం నిర్వహించారు. భద్రాచలంలో చేపట్టనున్న అభివృద్ధి పనుల సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సూచనల మేరకు శాశ్వతంగా దేవస్థానంతోపాటు భక్తులకు లాభం చేకూరేవిధంగా నూతన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. అయోధ్యకు మించి భద్రాచలం అభివృద్ధి ప్లాన్ ఉండాలని సూచించినట్లు సమాచారం. ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో వీటికి సంబంధించిన వివరాలను బహిర్గతం చేయొద్దని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన, భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుక అక్రమ తవ్వకాలు నిలిపివేత

కాంగ్రెస్ నాయకుడిని మందలించిన సీఐ జితేందర్‌రెడ్డి



ఇసుక తవ్వుతున్న ముఠాను పంపించేస్తున్న పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేట: మండలంలో ఇసుక అక్రమ రవాణాపై శుక్రవారం 'సాక్షి'లో 'అధికార ముసుగులో ఇసుక దోపిడీ'అనే కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డి శుక్రవారం దమ్మపేట పోలీస్ స్టేషన్‌కు సదరు కాంగ్రెస్ నాయకుడిని పిలిపించారు. ఇక నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడొద్దని మందలించారు. అశ్వారావుపేట పోలీసులు గుర్రాలచెరువు గ్రామ సమీపంలోని వాగులో ఇసుక తొవ్వకాలు జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించారు. ఎప్పటిలాగానే ఇసుకను సేకరిస్తున్న ముఠాను అక్కడి నుంచి పంపించేశారు. ఇసుక అక్రమంగా తవ్వడానికి వీల్లేదని ప్రభుత్వ నిబంధనల ప్రకారం మన ఇసుక వెబ్‌సైట్‌లో ఉచిత ఇసుకను బుక్ చేసుకుని సేకరించాలని సూచించారు.

ప్రైవేట్ ఫ్యాక్టరీకి కేటాయించొద్దు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్రంలోనే ఆయిల్ పామ్ తోటల సాగు అత్యధికంగా ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏరియాను ప్రైవేట్ ఫ్యాక్టరీకి కేటాయించొద్దని తెలంగాణ రాష్ట్ర ఆయిల్‌పాం గ్రోయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఆలపాటి రామచంద్ర ప్రసాద్, కోటగిరి సీతారామస్వామి కోరారు. అశ్వారావుపేట మండలం నారంవారిగూడెంలోని ఆయిల్‌ఫెడ్ డివిజనల్ కార్యాలయం శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రైవేట్ కంపెనీ కేవలం ఆరు మండలాల్లోనే పామాయిల్ తోటలను సాగు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆయా మండలాలను సైతం ఆయిల్‌ఫెడ్‌కు అప్పగించి, జిల్లాను ప్రైవేట్ కంపెనీకి కేటాయించాలనే యోచనను విరమించుకోవాలని కోరారు. అనంతరం ఆయిల్‌పామ్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో బండి భాస్కర్, జేకేవీ.రమణారావు, మొగళ్లపు చెన్నకేశవరావు, మల్లిరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, అంకత మహేశ్వరరావు, కేవీ.సత్యనారాయణ, మురళీ, దొడ్డా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్‌కు నిప్పంటించిన మావోయిస్టులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ప్రైవేట్ నెట్‌వర్క్‌కు చెందిన సెల్ టవర్‌ను మావోయిస్టులు దగ్ధం చేశారు. కొండగావ్ జిల్లా కేజాంగ్‌లో ఉన్న సెల్ టవర్ వద్దకు గురువారం అర్ధరాత్రి వచ్చిన మావోయిస్టులు కంట్రోల్ ప్యానల్, బ్యాటరీ బోర్డులపై డీజిల్ చల్లి నిప్పంటించారు. అక్కడ 'కేంద్రంలో పాలన సాగిస్తున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు దేశాన్ని హిందూ దేశంగా మార్చేందుకు కుట్రలు చేస్తున్నందున ప్రజలంతా వ్యతిరేకించాలి'అని కోరుతూ మావోయిస్టు పార్టీ తూర్పు బస్తర్ డివిజన్ కమిటీ పేరిట బ్యానర్లు, కరప త్రాలు వదిలారు. ఘటనాస్థలిని డిప్యూటీ సూపరింటెండెంట్ సతీశ్‌భార్గవ్ పరిశీలించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యాన మావోయిస్టులు ఇలాంటి ఘటనలకు పాల్పడుతుండటంతో ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు.

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టిన ఆటో

ఒకరు మృతి, ఇంకొకరి పరిస్థితి విషమం

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లిలో శుక్రవారం రాత్రి ఆగి ఉన్న టిప్పర్‌ను ఆటో ఢీకొట్టగా తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. ఇదేఘటనలో ఇంకో వ్యక్తికి గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. వివరాలు... పందిళ్లపల్లి గ్రామానికి చెందిన లింగం నాగరాజు ఆటోలో ఆయనతో పాటు లింగం మహేష్, ఖమ్మం అగ్రహారం కాలనీకి చెందిన తోట గోపి(22), సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం రేవూరుకు చెందిన ఈర్ల మహేష్ ఓ వివాహానికి సంబంధించి జగన్నాథపురం వైపు నుంచి పందిళ్లపల్లి వస్తున్నారు. ఇదేసమయాన టిప్పర్ టైరుకు పంక్చర్ కావటంతో డ్రైవర్ పందిళ్లపల్లి చివర పంక్చర్ షాపు వద్ద వాహనాన్ని నిలిపాడు. అయితే, ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో ఆటో నడుపుతున్న తోట గోపి, ఈర్ల మహేష్ తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో గోపి మృతి చెందాడు. అలాగే, మహేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ప్రమాద సమాచారం తెలిసిన ఎస్సై షేక్ నాగుల్ మీరా చేరుకుని విచారణ చేపట్టారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

తల్లాడ: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై కొండల్‌రావు తెలిపిన వివరాలు... మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన గుండ్ల ఉపేందర్‌రావు స్థానికంగా రహదారి పక్కన హార్వెస్టర్‌ను దింపుతుండగా సత్తుపల్లి నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన ఉపేందర్‌రావును చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించినట్లు ఎస్సై తెలిపారు.

'ట్రాక్' తప్పిన పనులు

కొనసా..గుతున్న రైల్వే ట్రాక్ పనులు

- బీటీపీఎస్‌కు బొగ్గు తరలింపు కోసం నిర్మాణం
- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని వైనం
- రోడ్డుమార్గంలో తరలింపుతో తరచుగా ప్రమాదాలు



భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్

మణుగూరుటౌన్: గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్)కు బొగ్గు తరలింపు కోసం నిర్మిస్తున్న రైల్వే మార్గం పనులు అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్న చందంగా కొనసాగుతున్నాయి. 2022లో పూర్తి కావాల్సిన పనులు ఇప్పటికీ పూర్తికాకపోగా.. ట్రాక్ ఎప్పటికి అందుబాటులోకి వస్తుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా రోడ్డుమార్గంలో వాహనాల ద్వారా బొగ్గు తరలిస్తుండటంతో తరచుగా జరుగుతున్న ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడుతున్నారు. అంతేకాక దుమ్ము దూళి వల్ల అనారోగ్యం బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ప్రణాళిక లోపంతోనే ట్రాక్ నిర్మాణ పనులు అలస్యమవుతున్నాయనే విమర్శలు వస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.

సర్వే దశలోనే సమస్య

2020లో 15.87 కిలోమీటర్ల మేర ట్రాక్ నిర్మాణానికి 129.05 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. రైలు మార్గం నిర్మాణానికి సేకరించే భూనిర్వాసితులకు రీహ్యాబిలిటేషన్, రీసెటిల్‌మెంట్ (ఆర్.ఆర్) చట్టప్రకారం న్యాయమైన పరిహారం అందిస్తామని అధికారులు ప్రకటించారు. భూసేకరణ సమయంలో క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు.. ట్రాక్ నిర్మాణ పనుల సమయాన రంగంలోకి దిగిన అధికారులు వేర్వేరు కావడంతో చెప్పిన విస్తీర్ణం కంటే ఎక్కువ తీసుకుంటున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ప్రణాళిక లోపంతో రామానుజవరం, విప్పలసింగారం, తిర్లాపురం, సాంబాయిగూడెం, మణుగూరులోని గాంధీనగర్ గ్రామస్తులకు శాపంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఎక్కువగా సేకరించిన భూమికి పరిహారంపై స్పష్టత ఇవ్వకపోగా పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మరికొందరు రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ అధికారుల హామీ అమలుకు వేచి చూస్తున్నారు. రైల్వే ట్రాక్ ఏర్పాటు సమయాన కొన్నిచోట్ల 40 మీటర్లు, మరికొన్ని చోట్ల 60 మీటర్లు తీసుకుంటుండటంతో కొందరి నివాసాల ముందే ట్రాక్ వచ్చే పరిస్థితి నెలకొంది. ఇక అర ఎకరం కంటే ఎక్కువ భూమి ట్రాక్‌లో పోయిన రైతులకు ఆర్‌ఆర్ కింద పరిహారంతో పాటు ఉపాధి కల్పిస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు మాట మాటమారుస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. విప్పలసింగారంలో 'వై' జంక్షన్ మధ్యలో కొన్ని ఇండ్లు రావడంతో వాటికి పరిహారం అందించక పనులు కొనసాగించే పరిస్థితి లేదు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇలా రకరకాల సమస్యలతో ట్రాక్ నిర్మాణం నత్తనడకన సాగుతోంది.



కొనసాగుతున్న రైల్వే బ్రిడ్జి పనులు

ప్రమాదాలకు నిలయం..

2020లో బొగ్గు రవాణా కోసం చేపట్టిన రైలు మార్గం పనులు 2022 నాటికి పూర్తి చేయాలనేది లక్ష్యం. కానీ నాలుగేళ్లుగా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో బీటీపీఎస్‌కు ప్రతీరోజూ 15వేల టన్నుల నుంచి 20 వేల టన్నుల బొగ్గును రోడ్డు మార్గంలోనే తరలిస్తున్నారు. ఈ క్రమంలో అవగాహన లేని టిప్పర్ల డ్రైవర్లు పనిబత్తిడితో నడిపిస్తుండటంతో మణుగూరు - పినపాక రహదారిపై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఇక బీటీపీఎస్‌కు రోడ్డుమార్గంలో బొగ్గు తరలించేందుకు పర్యావరణ అనుమతుల గడువు ముగిసినా మరలా అనుమతి పొందారే తప్ప ట్రాక్ నిర్మాణంపై దృష్టి సారించడం లేదు. బీటీపీఎస్ రైల్వేట్రాక్ పనులకు సంబంధించి సమీక్షలు సరిగ్గా జరగకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైల్వే ట్రాక్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ప్రభావిత ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



రామానుజవరం వద్ద బొగ్గు లారీ కారణంగా జరిగిన ప్రమాదం (ఫైల్)

పనుల్లో వేగం పెంచాలి



రైల్వే ట్రాక్ పనులను వేగంగా పూర్తి చేయాలి. కొందరు నిర్వాసితుల ఇంటికి సమీపాన ట్రాక్ వస్తున్నా పరిహారం అందించలేదు. వీరికి పరిహారం చెల్లించడంతో పాటు రోడ్డు మార్గంలో బొగ్గు తరలిస్తుండడంతో జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాక్ పనుల్లో ఇకనైనా వేగం పెంచాలి.

–ఆర్.మధుసూదన్‌రెడ్డి, ఎన్‌డీ నాయకుడు

ఆర్.ఆర్ ఇస్తామన్నారు.. మరిచారు..



చెరువుముందు సింగారం, సూరయ్యగుంపు రైల్వే ట్రాక్‌లో 'వై' జంక్షన్ రావడంతో మధ్యలో ఉన్న ఇళ్లు కూడా తీసుకుని ప్యాకేజీ ఇస్తామన్నారు. కానీ, అధికారులు ఇప్పుడేం చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు. కొన్ని చోట్ల ఇంటి వాకిలి, ఇంటి వెనుక స్థలాలు పోతున్నా పరిగణనలోకి తీసుకోవడం లేదు.

–గోరంట్ల కనకయ్య, మాజీ ఉపసర్పంచ్, విప్పలసింగారం

కాంగ్రెస్ హయాంలో అన్ని రంగాల అభివృద్ధి



నాగేశ్వరరావును సన్మానిస్తున్న కిసాన్ సెల్ నాయకులు

ముదిగొండ: కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించడమే కాక అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. ముదిగొండ మండలం కమలాపురంలో జరుగుతున్న శ్రీఅంకమ్మ జాతరకు డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి శుక్రవారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మి, శ్రీమద్దిరావమ్మ, పెద్దమ్మ అమ్మవార్లకు పూజలు చేయగా.. కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు వల్లూరి భద్రారెడ్డి అధ్యక్షతన రాయల నాగేశ్వరరావును సన్మానించారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ నేతృత్వాన సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలుచేస్తుండగా, రైతుల సంక్షేమానికి నిధుల కేటాయింపు జరుగుతోందని తెలిపారు. ఈకార్యక్రమంలో కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్క శేఖర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, సొసైటీ డైరెక్టర్ వనం ప్రదీప్తబాబుతో పాటు పసుపులేటి దేవేంద్రం, ఇలవల పుల్లారెడ్డి, శిరిగిరి కుల్లాయ్, వట్టికూటి వెంకటేశ్వర్లు, ఎండీ.అజ్గర్, బాబురాంరెడ్డి, వాక వెంకటేశ్వరరెడ్డి, పందిరి అంజయ్య, బిచ్చాల బిక్షం, ఆదినారాయణరెడ్డి, ఏలూరి హన్మంతరావు, కోలేటి నాగేశ్వరరావు, వీరారెడ్డి, రామయ్య, పాల్గొన్నారు.

రేపు బీఎస్పీ సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కామేశ్

పాల్వంచ: రానున్న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఈనెల 31వ తేదీన ఖమ్మంలో నిర్వహించే సన్నాహక సమావేశానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మందా ప్రభాకర్, కోఆర్డినేటర్ మతాపురం బాలయ్య హాజరవుతారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ తెలిపారు. పాల్వంచలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంలో జరిగే సన్నాహక సమావేశంలో అభ్యర్థి విజయానికి చేపట్టాల్సిన కార్యాచరణపై రాష్ట్ర అధ్యక్షుడు దిశానిర్దేశం చేయనున్నందున నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ఈసమావేశంలో నాయకులు వినకొండ రంజిత్, కొప్పుల వినయ్‌కుమార్, గుడిమెట్ల లోకేశ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చీపురుబట్టి ఎదురుకాల్పులు బూటకం

మావోయిస్టు పార్టీ దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగ

చర్ల: ఛత్తీసగఢ్‌లోని బీజాపూర్ జిల్లాలోని బాసగూడ సమీపాన చీపురుబట్టిలో జరిగింది బూటకపు ఎన్‌కౌంటర్ అని మావోయిస్టు పార్టీ దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగ ఆరోపించారు. శుక్రవారం మీడియాకు ఆయన లేఖ విడుదల చేశారు. జేగురుగొండ ఏరియా కమిటీ మెంబర్ గంగి, పీఎల్‌జీఏ 10వ బెటాలియన్ కమాండర్ నగేశ్ చీపురుబట్టి గ్రామస్తులతో సమావేశమయ్యేందుకు నిరాయుధులుగా వెళ్లి నిద్రిస్తుండగా, వారిని పోలీసులు పట్టుకొని కాల్చి చంపారని ఆరోపించారు. అంతేకాక మరో నలుగురు గ్రామస్తులు పొలాల్లో పనులు చేస్తుండగా వారినీ కాల్చి చంపారని పేర్కొన్నారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఏప్రిల్ 3న బీజాపూర్, సుక్మా జిల్లాల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపారు.

దంతెవాడ పోలీసుల అదుపులో మావోయిస్టు

చర్ల: పోలీసు బలగాలను చూసిపారిపోతున్న ఓ మావోయిస్టును వెంబడించిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. దంతెవాడ జిల్లాలోని కట్టేకల్యాణ్ పోలీస్ స్టేషన్ పరిధి తుమ్మాపాల్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో పోలీసులతో పాటు సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా నాదేనార్ సమీపంలోని అటవీ ప్రాంతం వద్ద పోలీసులను గమనించిన ఓ మావోయిస్టు పారిపోతుండగా ఆయనను వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. ఆయనను విచారించగా నాదేనార్‌కు చెందిన కవాసి హిడ్మా అలియాస్ సుయికాగా తేలింది. సదరు వ్యక్తిపై కట్టేకల్యాణ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులు ఉండగా.. రిమాండ్‌కు తరలించినట్లు దంతెవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్ తెలిపారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కోసం..



మాట్లాడుతున్న సీఈఓ శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లిటౌన్: తెలుగు వారి ఘనతను విశ్వవ్యాప్తం చేసేందుకే తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ఏర్పడిందని సీఈఓ డాక్టర్ బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యాలయానికి చెందిన 62 మంది విద్యార్థులు శాస్త్రీయ వాస్తవాలు, వివరణలను వెల్లడించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు కోసం కృషి చేస్తున్నారు. ఒక్కొక్కరు ఒక్కో అంశంపై 120 నిమిషాల పాటు దృశ్యరూప వీడియోలు రికార్డు చేయనుండగా, శుక్రవారం ట్రయల్‌రన్ పూర్తయింది. ఈకార్యక్రమాన్ని పరిశీలించిన శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ న్యాయనిర్ణేతల సమక్షాన 31వ తేదీన మరోమారు పరీక్షించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేస్తామని తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం



రక్తపు మడుగులో పడిఉన్న అహ్మద్

వైరా: వైరాకు చెందిన ఓ వ్యక్తి కుటుంబ కలహాలతో శుక్రవారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక చేపలకాలనీకి చెందిన షేక్ లాల్ అహ్మద్‌కు మధిర మండలం ఆత్కూర్‌కు చెందిన షేక్ రంజాన్‌బీతో 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉండగా. నిత్యం గొడవలు జరుగుతుండడంతో పెద్దలు పంచాయతీ నిర్వహించమే కాక లాల్ అహ్మద్‌పై రంజాన్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంతలోనే శుక్రవారం రంజాన్‌బీ పుట్టింటికి వెళ్లడంతో అహ్మద్ బస్టాండ్ ఎదురుగా చేయి కోసుకోగా తీవ్ర రక్తస్రావమై స్పృహ కోల్పోయాడు. దీంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకుని ఆయనను ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

భార్యను కాపాడే క్రమంలో ప్రమాదం



రవి (ఫైల్)

పెనుబల్లి: విద్యుత్‌షాక్ నుంచి భార్యను కాపాడిన వ్యక్తి అపస్మారకస్థితిలోకి వెళ్లగా ఆస్పత్రికి తరలించే క్రమంలో కన్నుమూశాడు. ఈ విషాద ఘటన పెనుబల్లి మండలం కుప్పెనకుంట్లలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన వల్లవరపు రవి(43) భార్య ఉదయం స్నానం చేసి వస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగను తాకడంతో షాక్‌కు గురైంది. ఈ విషయాన్ని గమనించి రవి భార్యను కాపాడే క్రమాన షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఈమేరకు కుటుంబీకులు ఆయనను హుటాహుటిన తిరువూరు ఆస్పత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతి చెందాడు. భార్య ప్రాణాలు కాపాడిన ఆయన చనిపోవడంతో గ్రామంలో విషాదం నెలకొనగా.. వీ.ఎం.బంజర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బెల్ట్ దుకాణాల్లో మద్యం సీజ్

దమ్మపేట: అనుమతి లేకుండా బెల్ట్ దుకాణాల్లో విక్రయిస్తున్న మద్యాన్ని ఎఫ్‌ఎస్‌టీం, పోలీసులు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశారు. శుక్రవారం మండలంలోని ఆర్లపెంట, నాయుడుపేట, ముష్టిబండ గ్రామాల్లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణాల్లో మద్యం నిల్వలు ఉన్నాయనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులకు, ఎఫ్‌ఎస్‌టీం అక్కడకు చేరుకున్నారు. 42.56 లీటర్ల మద్యం బాటిళ్లు, 22 బీర్లు స్వాధీనం చేసుకొని, సీజ్ చేశారు. సీజ్ చేసిన మద్యం విలువ రూ.36,586 ఉంటుందని, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు. దాడుల్లో ఎఫ్‌ఎస్‌టీం అధికారి కృష్ణ పాల్గొన్నారు.

32 బాటిళ్లు..

పాల్వంచరూరల్: బెల్టు దుకాణాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించి 32 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. మండలంలోని సూరారంలోని బెల్టు దుకాణంలో ఎస్‌ఐ శ్రీనివాస్ తనిఖీలు నిర్వహించగా 23 లిక్కర్ బాటిళ్లు, 9 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడి



డ్రమ్ములను ధ్వంసం చేస్తున్న అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని ములకనాపల్లి అటవీ ప్రాంతంలో ఎక్సైజ్ డీసీ జనార్దన్‌రెడ్డి, ఏసీ గణేశ్, ఏఈఎస్ కరంచంద్, కొత్తగూడెం ఈఎస్ జానయ్య ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది, పోలీసులు సంయుక్తంగా శుక్రవారం దాడులు చేపట్టారు. ఈ దాడిలో ములకనాపల్లి గ్రామ శివారులో ఉన్న వాగు దగ్గర అటవీ ప్రాంతంలో దాచి ఉంచిన డ్రమ్ములను గుర్తించి వాటిని ధ్వంసం చేసి 6వేల లీటర్ల పానకం, 50లీటర్ల సారాను పారబోశారు. దాడుల్లో భద్రాచలం, పాల్వంచ, మణుగూరు, ఎక్సైజ్ సీఐలు, దుమ్ముగూడెం సివిల్ ఎస్‌ఐ పోటు గణేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మణుగూరుటౌన్: మండలంలోని బ్రహ్మంగారిగుట్ట సమీపంలో నివసించే వ్యక్తి మనస్తాపంతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కోరగట్ల వరుణ్ (26) ప్రేమ వివాహం చేసుకోగా వివిధ కారణాలతో భార్య నుంచి విడాకులు తీసుకున్నాడు. ఈ క్రమంలో పిల్లలు, భార్య ఎవరూ లేకపోవడంతో తల్లితండ్రులకు తరచూ దూరంగా ఉండటంతో మనస్తాపానికి గురై మద్యం సేవించి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి లాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రులు మందలించడంతో..



జోగా శేఖర్(ఫైల్)

గుండాల: మద్యం తాగొద్దని తల్లిదండ్రులు మందలించడంతో ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన జోగా శేఖర్ (28) కొంతకాలంగా మద్యం సేవిస్తున్నాడు. గురువారం తల్లిదండ్రులు మద్యం తాగొద్దని మందలించారు. మనస్తాపానికి గురైన శేఖర్ రాత్రి పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి గుండాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యం పొందుతూనే శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

అన్నపురెడ్డిపల్లి: పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. మండలంలోని తొట్టిపంపు గ్రామానికి చెందిన కొమరం రాంబాబు (40) లారీడ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగాడు. గమనించిన బంధువులు కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న వ్యక్తి

ఖమ్మంక్రైం: ఖమ్మం ప్రకాష్ నగర్ బ్రిడ్జి సమీపాన గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో తీవ్రంగా గాయపడిన ఆయనను అన్నం ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. సదరు వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు సూచించారు.

రైతులకు పట్టుబడ్డ జనరేటర్ దొంగలు

దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

బూర్గంపాడు: బూర్గంపాడు, సంజీవరెడ్డిపాలెం, మోరంపల్లిబంజర గ్రామాల రైతులకు చెందిన వ్యవసాయ విద్యుత్ మోటార్లు, పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను ఇటీవల దొంగలు ఎత్తుకెళ్తున్నారు. రైతులు చోరీ ఘటనలపై ఎన్నిసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఫలితముండటం లేదు. దీంతో రైతులు రాత్రి వేళల్లో మోటార్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు కాపలా ఉంటున్నారు. రైతులు మోటార్లకు కాపలా ఉంటున్న విషయం గుర్తించిన దొంగలు గురువారం రాత్రి సంజీవరెడ్డిపాలెంకు సమీపంలోని క్రషర్‌మిల్లులోని జనరేటర్‌ను చోరీ చేసేందుకు యత్నించారు. జనరేటర్‌ను ట్రాలీ ఆటోలోకి ఎక్కిస్తున్న సమయంలో శబ్దం కావటంతో రైతులు అటుగా వెళ్లి పరిశీలించారు. ఆటోలో జనరేటర్‌ను ఎక్కించేందుకు యత్నిస్తున్న నలుగురిలో ఇద్దరు రైతులను చూసి పారిపోయారు. మరో ఇద్దరిని రైతులు పట్టుకుని, దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గతంలో మోటార్ల దొంగతనాలకు ఈ ముఠానే పాల్పడి ఉంటుందని రైతులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

పాల్వంచ: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని పాత పాల్వంచ మొర్రేడు వాగు సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో ఎస్‌ఐ బి.రాఘవయ్య తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.4,700 నగదు, 3 మోటార్ సైకిళ్లు, 6 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశారు.

పోక్సో కేసు నమోదు

ములకలపల్లి: బాలికను ప్రేమ పేరుతో మోసం చేసి, గర్భవతిని చేసిన వ్యక్తిపై శుక్రవారం పోక్సో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను సమీప గ్రామానికి చెందిన యువకుడు ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక అనారోగ్యంగా ఉండటంతో కుటుంబీకులు ఆరా తీయగా, బాలిక గర్భవతైన విషయం వెలుగులోకి వచ్చింది. యువకుడు పెళ్లికి నిరాకరించడంతో బాధిత కుటుంబీకులు ములకలపల్లి పోలీసులను ఆశ్రయించారు. ఎస్‌హెచ్‌ఓ పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.